క్లుప్తంగా

లోయపల్లిలో పశువైద్య శిబిరం



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

అర్వపల్లి: మండల పరిధిలోని లోయపల్లి గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరంలో 150 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి డాక్టర్ బి. అర్జున్ మాట్లాడుతూ.. రైతులు తమకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. కార్యక్రమంలో వీఎల్‌ఓ కేఎస్‌ఎస్ పద్మ, సిబ్బంది యాదగిరి, యాకయ్య, గోపాలమిత్రలు ఆల్డాస్ లింగయ్య, సూరారపు అర్జున్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రమౌళి మృతి తీరని లోటు



చంద్రమౌళి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నూతనకల్: మండల పరిధిలోని మాచనపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చౌగాని చంద్రమౌళి మృతి పార్టీకి తీరని లోటని మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన చంద్రమౌళి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో దరిపెల్లి వీరన్న, సురుగు రామచంద్రు, వెంకటమల్లు, వీరబోయిన వెంకటమ్మ, బొల్క గంగయ్య, సైదులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నూతనకల్: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు సంగినేని ఎల్లమ్మ ఇటీవల మృతిచెందింది. ఆదివారం మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి ఎల్లమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. ఎల్లమ్మ మృతి పార్టీకి తీరని లోటని ఆయన అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధసుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు మహేశ్వరం చంద్రకళవెంకటయ్య, ఎంపీటీసీ పన్నాల రమామల్లారెడ్డి, బొడ్డుపల్లి అంజయ్య, రాజబహదూర్‌రెడ్డి, కందుకూరి శ్రీకాంత్, బత్తిని వెంకటేష్, కొల్లు రవి, సామ ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

టెలీ-లా ప్రోగ్రాంను సద్వినియోగం చేసుకోవాలి

తుంగతుర్తి: టెలీ-లా ప్రోగ్రాంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తుంగతుర్తి మండలం అన్నారం గ్రామంలోని కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్సీ) నిర్వాహకుడు వెలిశాల మధు అన్నారు. ఆదివారం తుంగతుర్తి మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. భారత ప్రభుత్వం టెలీ-లా ప్రోగ్రాం ద్వారా న్యాయపరమైన సమస్యలకు ఫోన్ కాల్‌లో లాయర్ల సలహాలు, సహాయం అందిస్తోందన్నారు. ఈ ప్రోగ్రాం ద్వారా ఆస్తి హక్కులు, భూ సమస్యలు, కట్నం, కుటుంబ వివాదాలు, విడాకులు, గృహహింస నుంచి రక్షణ, లైంగిక వేధింపులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సభ్యులపై హింస, పురుషులు, స్త్రీలకు సమాన వేతనాలు, ప్రసూతి ప్రయోజనాలు, భ్రూణహత్యల నివారణ, బాల్య వివాహాల నిషేధం, పోక్సో(లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం), ఎఫ్ఐఆర్ నమోదు తదితర వాటికి సంబంధించి చట్టపరమైన సహాయాన్ని అందిస్తోందని అన్నారు. అన్నారం గ్రామంలోని సీఎస్సీ కేంద్రం ద్వారా ఉచితంగా లాయర్లచే మాట్లాడుటకు ఆన్‌లైన్ బుకింగ్ చేస్తున్నామని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



భగవద్గీతలోని త్రైత సిద్ధాంతాన్ని వివరిస్తున్న కమిటీ సభ్యులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని గోపాలపురంలో ఆదివారం భగవద్గీతలోని త్రైత సిద్ధాంతంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. హోలీ పండుగను పురస్కరించుకొని భగవద్గీత జ్ఞానం అనే రంగు చల్లుకోవాలని త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి కోదాడ కమిటీ అధ్యక్షుడు పోటు వెంకటేశ్వర్లు అన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వెంటాడుతున్న తాగునీటి కష్టాలు

- గోపాలపురంలో తాగునీరందక ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు
- శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకోలు

అర్వపల్లి: అర్వపల్లి గ్రామ పంచాయతీ ఆవాసం గోపాలపురంలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ రక్షిత మంచినీటి పథకం అంటూ ఏమీలేదు. కేవలం మిషన్ భగీరథ నీళ్లే ఆధారం. అయితే పాలేరు రిజర్వాయర్‌లో నీళ్లు అడుగంటి కొద్దిరోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. దీంతో గ్రామస్తులకు నీటి కష్టాలు మొదలయ్యాయి. ఈ ఆవాస గ్రామంలో 30 వరకు ఇళ్లు ఉన్నాయి. సుమారు 100 మంది జనాభా ఉంటారు. ఇంటింటికి నల్లా కనెక్షన్లు ఉన్నాయి. అయితే ఇంతకాలం మిషన్ భగీరథ నీళ్లు రావడంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంది. కానీ ఇటీవల మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో నీటికి కటకట ఏర్పడింది. అయితే ఇక్కడ ఇళ్లు మొత్తం బోడుపై ఉంటాయి. ప్రస్తుతం నీళ్లు లేక ప్రజలు బోడుపై నుంచి కిందకు దిగి పొలాల వద్ద నుంచి నీళ్లు మోసుకుపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ బోడుపై ఒక చేతి పంపు ఉండగా అది కూడా వట్టిపోయింది. దీంతో చుక్క నీరు లేని పరిస్థితి ఏర్పడింది.

బోరు వేసి..

మిషన్ భగీరథ నీళ్లు వచ్చే పరిస్థితి లేనందున నీటి సమస్య తీర్చడానికి ఇక్కడ శాశ్వత పరిష్కారం చూపాల్సి ఉంది. ఇక్కడ ప్రత్యేకంగా బోరు వేసి ట్యాంక్‌కు కనెక్షన్ ఇచ్చి నీటి సరఫరా చేయాల్సి ఉంది. ఇలా శాశ్వత పరిష్కారం చేస్తేనే ఈ నీటి సమస్య తీరనుంది. ప్రస్తుతం మహిళలు నీటిని బోడు నుంచి కిందకు దిగి పొలాల వద్ద నుంచి తెచ్చుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



గోపాలపురంలో నిరుపయోగంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్

మిషన్ భగీరథ నీళ్లు రావటం లేదు



ఇంతకాలం మిషన్ భగీరథ నీళ్లు వచ్చేవి. 10 రోజుల నుంచి ఆ నీళ్లు నిలిచిపోయాయి. దీంతో ఆ నీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే నీటి సమస్యను పరిష్కరించాలి. తాత్కాలికంగా అద్దె బోరు తీసుకోనైనా నీటిని అందించాలి.

– దావుల మల్లమ్మ, గోపాలపురం

శాశ్వత పరిష్కారం చూపాలి



గోపాలపురంలో నీటి సమస్య తీర్చడానికి శాశ్వత పరిష్కారం చూపాలి. కొత్తగా బోరు వేసి ట్యాంక్‌కు కనెక్షన్ ఇచ్చి నీళ్లు సరఫరా చేయాలి. చుక్క నీరు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఎండలో నడుచుకుంటూ వెళ్లి పొలాల నుంచి నీటిని తెచ్చుకుంటున్నాం.

– దావుల పద్మ, గోపాలపురం

కనుల పండువగా చెన్నకేశవస్వామి కల్యాణం

సూర్యాపేట రూరల్: సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రిలో గల చెన్నకేశవస్వామి ఆలయ వార్షిక అధ్యయన బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎదుర్కోలు మహోత్సవం నిర్వహించి బొడ్రాయి చౌరస్తాలోని కల్యాణ మండపానికి స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఆదివారం ఆలయంలో హోమం, నిత్య పూర్ణాహుతి, బలిహరణ నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజబాబురెడ్డి, వంశపారంపర్య ధర్మకర్త ఉమ్మెంతల ఆహ్లాదరావు, ఉమ్మెంతల హరిప్రసాదరావు, అర్చకులు ముడుంబై రఘువరన్ ఆచార్యులు, దరూరి రాఘవాచార్యులు, గోమఠం రాఘవచార్యులు, డైరెక్టర్లు చెరుకుపల్లి కృష్ణయ్య, మంగపండ్ల మల్లికార్జున్, కుమ్మరికుంట్ల జానయ్య, చెరుకుపల్లి సైదమ్మ, గంపల శంకర్ పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

తిరుమలగిరి (తుంగతుర్తి): బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో అవినీతిరహిత పాలన అందాలంటే ప్రధాని నరేంద్ర మోదీ మూడోసారి అధికారంలోకి రావాలని అన్నారు. బూర నర్సయ్యగౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ శాఖ అధ్యక్షుడు సీహెచ్. హన్మంతు, మూల వెంకట్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, సోమయ్య, యాదగిరి, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తిరుమలగిరిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మేకనబోయిన సందీప్ మృతి బాధాకరం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి



సందీప్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మల్లు లక్ష్మి తదితరులు

సూర్యాపేట రూరల్: సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మేకనబోయిన శేఖర్, సైదమ్మల కుమారుడు మేకనబోయిన సందీప్ అనారోగ్యంతో మృతిచెందడం అత్యంత బాధాకరమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. ఆదివారం సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు రాయినిగూడెంలో జరిగిన మేకనబోయిన సందీప్ దశదిన కర్మకు ఆమె హాజరై సందీప్ చిత్రపటానికి నివాళులర్పించారు. శేఖర్, సైదమ్మ దంపతులకు ధైర్యం చెప్పారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, ఐద్వా రాష్ట్ర నాయకులు కేఎన్ ఆశలత, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, చెరుకు ఏకలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు కొప్పుల రజిత, కందగట్ల అనంత ప్రకాష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. రాంబాబు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మర్రి నాగేశ్వరరావు, సీపీఎం త్రీటౌన్ కమిటీ సభ్యులు మండడి రాంరెడ్డి, బోళ్ల నాగేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో మతోన్మాదంపై పోరాడుదాం

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట): స్వాతంత్ర్య పోరాటంలో తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని అరుణోదయ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచనపల్లి సైదులు అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఈ నెల 29న ఏపూరులో నిర్వహించనున్న సభకు సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి అమరులయ్యారన్నారు. సమానత్వం, సమ సమాజ స్థాపన కోసం జరుగుతున్న పోరాటంలో యువత కీలకపాత్ర పోషించాలన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతిని పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో గ్రామగ్రామాన, వాడవాడలా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా కోశాధికారి బండి రవి, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు పిడమర్తి భరత్, రవి, సూదగాని రవిగోపాల్, కుంట రవి, కొరివి భరత్, వెంకన్న పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న పీవైఎల్ నాయకులు

సూర్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయా సమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు చేశారు. అనంతరం యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. అదేవిధంగా క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద సత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకులు కాకులారపు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, బీరవోలు ఇంద్రారెడ్డి, అర్చకులు మిర్యాల రామశర్మ, వేణుగోపాల శర్మ, భక్తులు పాల్గొన్నారు.



సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం



పల్లకీసేవలో ఆలయ అధికారి, అర్చకులు, భక్తులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో పాల్గుణ మాస పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాతః కాలంలో ఉభయ దేవేరులైన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామిని మండపంలో అదిష్ఠింపజేసి కల్యాణాన్ని అర్చకులు కనుల పండువగా జరిపించారు. మొదట కనకదుర్గ ఆలయం నుంచి దేవాలయ వద్దకు మేళతాళాలు, హరినామ సంకీర్తనలతో పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం సీతారామచంద్ర స్వామి, గోదాదేవి వేణుగోపాలస్వామిని ఒకే వేదికపై అధిష్ఠింపజేశారు. కల్యాణోత్సవంలో భాగంగా తొలుత విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనం జరిపి కంకణధారణ, యజ్ఞోపవీతం గావించారు. అనంతరం మంగళసూత్ర ధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలను అర్చకులు ఎన్.రాఘవాచార్యులు వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

● నాడు కళకళ.. నేడు వెలవెల



గతంలో ఆకర్షణీయంగా కనబడుతున్న ప్లాస్టిక్ పూలు



ప్రస్తుతం ప్లాస్టిక్ పూలు లేక బోసిపోయి కనబడుతున్న పూల కుండీలు

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్‌బండ్‌పై ఆహ్లాదం కోసం ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ పూలను కొంతమంది ఆకతాయిలు ఎత్తుకెళ్లడంతో పూల కుండీలు బోసిపోయి కనిపిస్తున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో మినీ ట్యాంక్‌బండ్ వద్ద ఆహ్లాదం కరువైందని స్థానికులు అంటున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట

ఘనంగా మట్టల పండుగ



నాగారం: ఫణిగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



ఆత్మకూర్(ఎస్): ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



పెన్‌పహాడ్: దూపహాడ్‌లో..

చివ్వెంల(సూర్యాపేట): మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఆదివారం మట్టల పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఖాసీంపేట గ్రామంలో బెతెస్త మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో చేపట్టిన వేడుకల్లో జిల్లా పాస్టర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు బిషప్ డాక్టర్ దుర్గం ప్రభాకర్ పాల్గొని మాట్లాడారు. ఈస్టర్ పండుగకు ముందు వచ్చే ఆదివారం రోజున ఈ కార్యక్రమం నిర్వహిస్తారని, ఇది జెరూసలేంలోకి క్రీస్తు ప్రవేశించడాన్ని గుర్తుచేస్తుందన్నారు. కార్యక్రమంలో దుర్గం కరుణ, కొమ్ము హోసన్నా, వల్లపట్ల దయానంద్, ఆదిమళ్ల దయానంద్, ఆదిమళ్ల బాబు, దైద రవి, డపుకు మల్లయ్య, యదవెల్లి యేసుపాదం, కత్తుల సుధాకర్, కిరణ్, అబ్రహం, పేతురు, మామిడి జానయ్య, ఉపేందర్, బొంత రాజు, దావీద్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నాగారంలో..

నాగారం: మండల పరిధిలోని ఫణిగిరి సీఎస్ఐ చర్చి, వర్ధమానుకోట, ఈటూరు, పేరబోయినగూడెం, పస్తాల గ్రామాల్లోని చర్చిల ఆధ్వర్యంలో క్రైస్తవులు ఆదివారం మట్టల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మట్టలు పట్టుకొని క్రైస్తవులు ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పాస్టర్లు రత్నాకర్, అశోక్, ముదిగొండ లాజర్, కర్నె మాణిక్యం, గొడిశాల అనిల్, వినోద్, యట భాస్కర్, గోరంట్ల సామేలు, చిలుకూరి కిరణ్, వేమల్ల ప్రకాష్, జక్కుల రాజు, ఉయ్యాల సుదర్శన్, భిక్షం, యాకూబ్, మహేష్, సాయిబాబు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) మండలంలో..

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట): మండల కేంద్రంలో ఆదివారం క్రైస్తవులు మట్టల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని చర్చి నుంచి ఈత మట్టలను రంగురంగుల కాగితాలతో అలంకరించి క్రీస్తును స్మరిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాపమ్మ, వెంకటమ్మ, పద్మ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్‌లో..

పెన్‌పహాడ్: మండల పరిధిలోని దూపహాడ్ గ్రామంలోని గ్రేస్ డైమండ్ ఇవాంజికల్ చర్చి పాస్టర్ జాన్ ప్రకాష్ ఆధ్వర్యంలో ఆదివారం మట్టల పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పద్మారాగం, ప్రకాష్ పాల్, జాషువా, అభిషేక్, ప్రభుదాస్, హెబ్రా, ఆశీర్వాదం, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులు భయం వీడాలి



2కే రన్‌ను ప్రారంభిస్తున్న వైద్య సిబ్బంది

సూర్యాపేట: క్షయ వ్యాధిగ్రస్తులు భయం వీడి చికిత్స తీసుకుంటే ఆ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని వెన్నెల ఆస్పత్రి డాక్టర్ మామిడి నరేష్, ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ రమేష్‌చంద్ర అన్నారు. క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వెన్నెల ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం సద్దుల చెరువు మినీ ట్యాంక్ బండ్‌పై నిర్వహించిన 2కే రన్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు. క్షయ వ్యాధి నివారణే లక్ష్యంగా ర్యాలీ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఆరు నెలల కోర్సు తప్పకుండా వాడితే క్షయ వ్యాధిని నివారించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు చంద్రశేఖర్, శ్రీనివాస్, ఆస్పత్రి సిబ్బంది దయాకర్, నాగరాజు, రవి, శివ, నజీర్, శ్రీకాంత్, చైతన్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే పూర్తి

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే ఆదివారంతో పూర్తయింది. మండలంలోని 12,685 కుటుంబాల నుంచి ఆశ కార్యకర్తలు ఈ నెల 11 నుంచి 13 రోజుల పాటు సర్వే చేపట్టారు. ఈ సర్వేలో 50 మంది అనుమానితులను గుర్తించారు. వీరిని స్థానిక పీహెచ్‌సీకి ఒకటి రెండు రోజులలో పిలిపించి వైద్య పరీక్షలు చేయనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ చిలుకూరి మణిదీప్, సీహెచ్‌ఓ ఎల్. చరణ్ తెలిపారు. వ్యాధిగ్రస్తులకు ఎండీటీ చికిత్స ద్వారా వైద్యం చేసి కుష్టు వ్యాధిని పూర్తిగా నయం చేయనున్నట్లు చెప్పారు.



అర్వపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న సీహెచ్‌ఓ చరణ్, డీపీఎంఓ సురేష్

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



తోరణాలు కడుతున్న చైర్మన్ వెంకటేశ్వరరావు, సభ్యులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని తొగర్రాయిలో గల రుక్మిణి సత్యభామగోదాదేవి సమేత శ్రీ సంతాన వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అంకుర్పారణ చేశారు. స్వామివారికి విశ్వక్సేన పుణ్యాహవచనం, పవిత్ర నదీజలాలతో ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, నవకలశ స్నపనం, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారికి ఆలయ ధర్మకర్తలు యాదా శ్రీనివాసరావు-జ్యోతి దంపతులు పట్టువస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అమరనాయిని వెంకటేశ్వరరావు, సంధ్య, నందులశాస్త్రీ, హనుమంతరావు, శ్రీధర్, లక్ష్మీనరసింహారావు, ఏడుకొండలు, సింగరయ్య, ఉపేందర్ తదితరులు ఉన్నారు.

బండపాలెంలో నేడు స్వామివారి కల్యాణం..

పట్టణంలోని తమ్మరబండపాలెంలో గల శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయని, సోమవారం రాత్రి స్వామి వారి కల్యాణం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

● మనల్ని ఎవర్రా ఆపేదీ..!

అర్వపల్లిలోని వైజంక్షన్‌లో ఓ కిరాణా వ్యాపారి కోతుల బాధ తాళలేక దుకాణానికి ముందు ఇనుప జాలీ ఏర్పాటు చేసుకున్నాడు. అయినప్పటికీ కోతులు ఇనుప జాలీ రంధ్రాల నుంచి చేతులు లోపలికి పెట్టి ఆదివారం కోడిగుడ్లను ఎత్తుకెళ్లాయి. చుట్టుపక్కల వారు గమనించి వెళ్లగొట్టే ప్రయత్నం చేయగా కోతులు వారి వెంట పడడడంతో పరుగు తీస్తూ తప్పించుకున్నారు.

– అర్వపల్లి



గోదావరి జలాలను వెంటనే పునరుద్ధరించాలి

అర్వపల్లి: గోదావరి జలాలను వెంటనే పునరుద్ధరించి పంటలను కాపాడాలని, లేదంటే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ఆ పార్టీ మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వారబందీ విధానంలో జిల్లాకు రెండు రోజుల కిందటే నీటిని విడుదల చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు నీరు ఇవ్వకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని వాపోయారు. ఈ సీజన్‌లో గోదావరి జలాలు సరిగా రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.25వేల చొప్పున రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

టెట్ ఫీజు తగ్గించాలి

తుంగతుర్తి: ప్ర ప్రభుత్వం పెంచిన టెట్ ఫీజును తక్షణమే తగ్గించాలని బీఆర్‌ఎస్ నాయకుడు మట్టిపల్లి వెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం తుంగతుర్తి మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పేపర్-1కు ఫీజు రూ.200, పేపర్-2 రాస్తే రూ.300 ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేపర్-1కు రూ.1000, రెండవ పేపర్ రాస్తే రూ.2000 ఫీజు పెంచి పేద, మధ్య తరగతి అభ్యర్థులపై ఆర్థిక భారం మోపడం సరికాదన్నారు. అదేవిధంగా 33 జిల్లాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట షేక్ షాబుద్దీన్, కుంట మధు, పరాల సతీష్, మల్లేష్, కొమరమల్లు, నాగార్జున తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న ఏపూరి సోమన్న

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామానికి చెందిన చెరుకు సుధాకర్ ఇటీవల మృతిచెందారు. మృతుడి కుటుంబ సభ్యులకు ఆదివారం ఏపూరి ఫౌండేషన్ చైర్మన్, గాయకుడు ఏపూరి సోమన్న రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. సుధాకర్ కుటుంబానికి అండగా ఉంటానని ఏపూరి సోమన్న తెలిపారు.

'ఐటీఐ' మంజూరు హర్షణీయం

హుజూర్‌నగర్ : నియోజకవర్గానికి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రభుత్వ ఐటీఐ కళాశాల మంజూరు చేయించడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పి.కాటమయ్య అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐటీఐ కళాశాల ఏర్పాటుతో యువతకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి హుజూర్‌నగర్‌కు మహర్దశ మొదలైందని ఆయన పేర్కొన్నారు.